# కాంగ్రెస్, బీజేపీలు.. రాష్ట్రానికి చేటు

- రోడ్డు షోలో మంత్రి మల్లారెడ్డి
- జనసంద్రమైన మేడ్చల్
- సంక్షేమం కొనసాగాలంటే బీఆర్ఎస్‌కు ఓటేయండి




మేడ్చల్‌లో నిర్వహించిన రోడ్డు షోకు తరలివచ్చిన జనం, ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, అక్టోబర్ 29: కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రానికి చేసిందేమీ లేదని, ఆ రెండు పార్టీలు రాష్ట్రానికి చేటు అని మంత్రి చామకూర మల్లారెడ్డి విమర్శించారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్, దమ్మాయిగూడలో మంత్రి మల్లారెడ్డి రోడ్డు షో నిర్వహించారు. అడుగడుగునా జనం మల్లారెడ్డికి బ్రహ్మరథం పట్టి.. మంగళహారతులతో స్వాగతం పలికారు. పలు చోట్ల గజమాలతో మల్లారెడ్డి అభిమానులు ఆయనను సత్కరించారు. జై తెలంగాణ, జై కేసీఆర్, జై మల్లారెడ్డి అంటూ నినదిస్తూ మద్దతు పలికారు. మేడ్చల్‌లోని వివేకానంద విగ్రహం వద్ద మంత్రి మల్లారెడ్డి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ...కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే మోరీలో వేసినట్టేనన్నారు. 24 గంటల కరెంట్, ఇంటింటికీ మంచినీరు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశానికి ఆదర్శంగా రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ తదితర ఎన్నో పథకాలు కేసీఆర్ అమలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 24 గంటల కరెంట్, ఇంటింటికీ నీళ్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని, మరోసారి మోసపోవద్దన్నారు. ఎంపీగా రేవంత్ రెడ్డిని మేడ్చల్ ప్రజలు గెలిపిస్తే పీసీసీ పదవి తెచ్చుకుని, టిక్కెట్లు అమ్ముకుంటున్నాడని మంత్రి ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించాలని, కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి, వైస్ రమేశ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, బీఆర్ఎస్ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, శేఖర్ గౌడ్, రైతుబంధు సమితి అధ్యక్షుడు నారెడ్డి, నందారెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు అంబేద్కర్ చౌరస్తా వద్ద మంత్రి మల్లారెడ్డికి స్వాగతం పలికారు.



క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జి కట్టెల శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## కాంగ్రెస్‌లో లీడర్లకే గ్యారంటీ లేదు

బంజారాహిల్స్, అక్టోబర్ 29: కాంగ్రెస్‌లో పని చేసే లీడర్లకే గ్యారంటీ లేదని, ఆ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఎవరు నమ్ముతారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎద్దేవా చేశారు. పదేండ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో హ్యాట్రిక్ సాధిస్తామన్నారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన బీఆర్ఎస్ సీనియర్ నేత కట్టెల శ్రీనివాస్ యాదవ్ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేతో కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు అంటూ హడావిడి చేస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరని, బీఆర్ఎస్ 65 పథకాలు గ్యారంటీవన్నారు. కర్నాటకలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదంటూ అక్కడి ప్రజలు రోడ్డు ఎక్కుతుంటే ఆ పార్టీ నేతలు ఇక్కడకు వచ్చి నీతులు చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ తరపున అభ్యర్థిగా బరిలోకి దిగిన అజారుద్దీన్‌కు క్రికెట్‌లో మంచి బ్యాట్స్‌మెన్‌గా పేరు ఉన్నదని, రాజకీయంలో పేరున్న బౌలర్ మాగంటి గోపీనాథ్ వేసే బాల్స్‌కు ఆయన వికెట్ పోవడం ఖాయమని నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి కట్టెల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సీఎన్.రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావుతో పాటు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో మర్రి ప్రచార హోరు

మల్కాజిగిరి, అక్టోబర్ 29: మల్కాజిగిరి నియోజకవర్గంలో అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రచారంలో దూకుడు పెంచారు. ఆదివారం వెంకటాపురం, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లలో మర్రి రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. అలాగే పలు సమావేశాలలో పాల్గొని అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. మల్కాజిగిరి పరిధిలోని సర్వే నంబర్ 278లో నివసిస్తున్న కుటుంబాల భూమి సమస్యలను ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే పరిష్కరించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. భూముల రెగ్యులరైజేషన్ కోసం జీఓ 59తో గజానికి రూ.27వేలు చెల్లించారని, కానీ ఇండ్ల యజమానులకు తాఖీదులు అందాయన్నారు. ఆందోళనకు గురైన ఇండ్ల యజమానులు తమ సమస్యను పరిష్కరించాలని తనను కోరారని తెలిపారు. తాను స్వయంగా సీఎం కేసీఆర్ వద్దకు సమస్యను తీసుకెళ్లానని చెప్పారు. వెంటనే సీఎం కేసీఆర్ స్పందించి మరో జీఓను విడుదల చేశారని... దాని ప్రకారం గజానికి రూ.250 కడితే సరిపోతుందన్నారు. ఇక్కడ నివసిస్తున్న దాదాపు 80వేల మంది సమస్యలు పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు సబితాకిశోర్, సునీతారాము యాదవ్, శాంతిశ్రీనివాస్ రెడ్డి, మీనా ఉపేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, ఆకుల నర్సింగరావు, అనిల్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం డివిజన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

## అభివృద్ధికి అండగా నిలువాలి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్ అక్టోబర్ 29: ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే పార్టీల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని, అభివృద్ధి చేసే బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని జీరా గుజరాతీ స్కూల్‌లో జైన సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దసరా సమ్మేళనం కార్యక్రమానికి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నవరాత్రుల సందర్భంగా నిర్వహించే దాండియాకు గతంలో ఇబ్బందులు ఉండేవని, బీఆర్ఎస్ హయంలో అటువంటి పరిస్థితులు లేవన్నారు. జైన్ సమాజ్‌కు చెందిన హిమాన్షు బాప్నాను మైనార్టీ కమిషన్ సభ్యునిగా నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఉప్పల్ భగాయత్‌లో ఆత్మగౌరవ భవనం నిర్మాణం కోసం భూమిని కేటాయించినట్టు తెలిపారు. గుజరాతీ సమాజ్‌కు స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నిర్వాహకులు ప్రకాష్ వోరా, మయంగ్, జస్మంత్ పటేల్, ఉత్తమ్‌కుమార్ సింగ్ రాజ్, పురోహిత్, జనక్‌జష్, చైన్‌సింగ్, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.

## ఆప్యాయంగా పలకరిస్తూ.. ప్రచారం



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, అక్టోబర్ 29: నియోజకవర్గంలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ.. ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం కవాడిగూడ డివిజన్‌లో మొదటిరోజు నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేశానని, మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి నేరుగా ఓటర్లను కలిసి ఆప్యాయంగా పలకరిస్తూ తాను చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రజల మధ్య ఉండి పని చేసేవారు ఎవరో గుర్తించి ప్రజలు ఓటు వేయాలని కోరారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో వెయ్యి కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

## సాయన్న ఆశయంతో ముందుకు సాగుతాం



కంటోన్మెంట్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత

మారేడ్‌పల్లి, అక్టోబర్ 29: నాన్న ఆశయం మేరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆహర్నిషలు కృషి చేస్తానని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి.లాస్యనందిత అన్నారు. ఆదివారం మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో జీహెచ్ఎంసీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సిఎన్. నర్సింహ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాస్యనందిత మాట్లాడుతూ... కంటోన్మెంట్ ప్రాంతం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పటికి.. తెలంగాణ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిందన్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ 31వ బస్టాండ్ వద్ద నాలా పునర్ నిర్మాణం పనులు, 5వ నంబర్ పూల్, నాలాబజార్ ప్రాంతాల్లో నాలా పరివాహక ప్రాంతాలను తీర్చిదిద్దడంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న ఎంతో కృషి చేశారని తెలిపారు.



గోషామహల్ నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్

-అబిడ్స్